ప్రజాశక్తి
శనివారం 15 నవంబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు



కాఫీ కార్మికుల వినతి

ప్రజాశక్తి -పాడేరు: తమ సమస్యలు పరిస్కారం చెయ్యాలని కాఫీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం 9వ రోజు కొనసాగింది. సమ్మె లో భాగంగా మినుములురు ఎస్టేట్ మేనేజర్ కార్యాలయంలో 9వ రోజు కార్మికులు బైఠాయింపుతో నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో హెల్పర్స్ కాంతమ్మ, గిరి,రాజు, సుందర్‌కుమార్, రంనాథ్, సత్యనారాయణ, కన్ననాద్, రాజారావు, వెంకీ, వసంత, అప్పలమ్మ పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న నేతలు, కాఫీ కార్మికులు

బిర్సా ముండా స్ఫూర్తితో..

గిరిజన చట్టాల రక్షణకు పోరాటం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర



అరకులోయలో బిర్సా ముండా చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న సురేంద్ర, నేతలు



హుకుంపేటలో నివాళి అర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: బిర్సా ముండా స్ఫూర్తితో గిరిజన హక్కులు, చట్టాల రక్షణకు పోరాటం చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర తెలిపారు. బిర్సా ముండా 150 వ శత జయంతి వారోత్సవాల సందర్భంగా శుక్రవారం అరకులోయలో ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయం, బొండం పంచాయతీ కొత్తవలస గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో భిర్సా ముండా చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, బిర్సా ముండా జయంతి జరుపుకునే నైతిక హక్కు బిజెపికి లేదన్నారు. అడవి, భూమి, నీరు ఆదివాసులకే దక్కాలని భగవాన్ బిర్సా ముండా పోరాటం గుర్తు చేశారు. దీనికి భిన్నంగా బిజెపి కూటమి ప్రభుత్వం అడవులు, సాగు భూములను, అటవీ సంపదలను అదానీ, నవయుగ కంపెనీలకు పవర్ ప్రాజెక్ట్ పేరుతో గిరిజన హక్కులు, చట్టాలకు విరుద్ధంగా భూములను కట్టబెడుతుందని విమర్శించారు. నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు,పవన్ కళ్యాణ్‌లు బిర్సా ముండా ఆశయాల కోసం పని చేస్తున్నామని చెప్పే నైతిక హక్కు లేదన్నారు. జాతి సంపదను బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ భగవాన్ బిర్సా ముండా జయంతిని పాడేరు కేంద్రంలో నిర్వహించి ఆదివాసి ప్రజలను మభ్యపెట్టాలనే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బ్రిటిష్ అరాచక పరిపాలనకు వ్యతిరేకంగా తన చిన్న వయసులోనే తెల్ల దొరలను గడగడలాడించిన విప్లవ వీరుడు భగవాన్ బిర్సా ముండా అని కొనియాడారు. అడవి, నీరు, భూమి పై హక్కు మనదేనని పెద్ద ఎత్తున ఆదివాసిలను ఐక్యం చేసి విరోచిత పోరాటం నిర్వహించాలన్నారు. చట్ట విరుద్ధంగా హైడ్రో పవర్ ప్రాజెక్టులను నిర్మించి ఆదివాసులను జల సమాది చేస్తామంటే సహించేది లేదని, పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. పెట్టుబడిదారులకు నరేంద్ర మోడీ నాయకత్వంలో హెూల్ సేల్ గా అటవీ భూములను, గిరిజన ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో అదాని, నవయుగ కంపెనీలకు కట్టబెడుతున్నారన్నారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినం ప్రస్తుతం అది 10 గంటలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మండల కార్యదర్శి కిండంగి రామారావు, జిల్లా కమిటీ సభ్యులు వివి జయ, జిల్లా కమిటీ సభ్యులు ఎస్బి పోతురాజు, నాయకులు పొద్దు బాలదేవ్, గెమ్మెలి చిన్నబాబు, గత్తుం బుజ్జిబాబు, నాగేంద్ర, కె అప్పన్న, సత్యారావు, జోషి, జి రామస్వామి పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని బూర్జ పంచాయతీ మజ్జివలస గ్రామంలో శుక్రవారం ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు, నాయకులు లక్ష్మణరావు మాట్లాడుతూ, అడవి, భూమి, నీటిని కాపాడుకోవడమే ఆయన ఆశయ సాధనమన్నారు. ఈ కార్యక్రమంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ మజ్జి సురేష్, కృష్ణారావు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాల జోలికి పోవొద్దు


ప్రజాశక్తి- పెదబయలు : యువత మత్తు, చెడు వ్యసనాల జోలికి వెళ్లొద్దని గోమంగి మండల సాధన సమితి నాయకుడు కూడ రాధాకృష్ణ, గంపరాయి ధనుంజయ్, కె.మత్స్య కొండబాబు అన్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గంజాయి కేసుల్లో ఇరుక్కొని జీవితాలు పాడు చేసుకోవద్దని హితవుపలికారు. ఇప్పటికే అనేకమంది యువకులు జైల్లో మగ్గుతున్నారని, వారి కుటుంబాలు రోడ్డున పడిన పరిస్థితి ఉందని తెలిపారు. గ్రామాభివృద్ధి దిశగా అడుగులు వేయాలన్నారు. యువతను చైతన్యపరిచేందుకు గ్రామ గ్రామాన్న సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమితి నాయకులు కూడా అనంత పద్మనాభం, కె మేఘరాజు, లోచెలి భగీరదరావు, కే బొంజుబాబు, గోమంగి భాస్కరరావు, కే మహేష్, లాలిబాబు, మోహన్‌రావు, గోమంగి నాగరాజు, గంపరాయి సత్యం, గోమంగి దేవి నాయుడు, సిసింద్రీ, మురళి, శంకర్, సూర్యనారాయణ, కే లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సమితి నేతలు

నవజాత శిశువుల సంరక్షణపై దృష్టి పెట్టాలి

- డిఎం అండ్ హెచ్ఒ కృష్ణమూర్తి నాయక్



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి పాడేరు:- జిల్లాలో క్షేత్రస్థాయిలో చేపట్టిన వైద్య ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను శతశాతం పూర్తిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి కృష్ణమూర్తి సూచించారు.వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులతో వారాంతపు ఫలితాలపై శుక్రవారం జూమ్ కాన్ఫరెన్స్ తో డి ఎం అండ్ హెచ్ ఓ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది గర్భిణిలను సకాలంలో గుర్తించి నమోదు చేయాలని, మాతా శిశువులకు నిర్దేశించిన సమయానికి వ్యాధి నిరోధక టీకాలు అందించాలని ఆన్ లైన్ సేవలను అప్డేట్ చేయించాలన్నారు. జాతీయ నవజాత శిశు వారంను ఈనెల 21 వరకు నిర్వహించబడుతుందన్నారు. నవజాత శిశు దశ పిల్లల్లో అత్యంత కీలకమైన దశ అన్నారు. ఈ సమయంలో మరణాల ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు."నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు" సీహెచ్సీల్లో "నవజాత స్థిరీకరణ యూనిట్లు" జిల్లా స్థాయిలో "ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ యూనిట్లు" ఉన్నాయని అన్నారు. న్యూమోనియా అవగాహన కార్యక్రమాలలు ప్రతి గ్రామంలోను నిర్వహించాలని వైద్యాదికారులకు ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు విధిగా ఇ.హెచ్.ఆర్ నమోదు చేయాలన్నారు. ర్యాపిడ్ రెస్పాన్స్ టీములను ఏర్పాటు చేసి ఫీవర్ సర్వేను నిర్విహించాలని, ల్యాబ్ టెక్నీషియన్ మరియు ఆరోగ్య పర్యవేక్షకులు సమన్వయంతో గుర్తించిన మలేరియా రోగులకు సకాలంలో చికిత్సలు అందునట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. స్కూల్ హెల్త్ కార్యాక్రమం ద్వార విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించి సకాలంలో వ్యాధులను గుర్తించి చికిత్సలు అందించాలని అన్నారు. క్షయ రోగులను సకాలంలో గుర్తించి వారికి తగిన మందులను అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్ లో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పి. పుల్లయ్య, జిల్లా అందత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ ప్యామిలీ ఫిజిషియన్ క్యాంప్ ప్రోగం అధికారి టి.విశ్వేశ్వర నాయుడు, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్ మరియు జిల్లా క్షయ అధికారి డాక్టర్ ఎం కిరణ్ కుమార్,జిల్లా వ్యాధి నిరోధక అధికారి సి.హెచ్ కమల కుమారి, జిల్లా మలేరియా అధికారి తులసి, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

-రెవెన్యూ డివిజనల్ అధికారి లోకేశ్వరరావు- పిజిఆర్ఎస్ కు 121 అర్జీలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సమస్యల పరిష్కారం వేగవంతం చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి లోకేశ్వరరావు సూచించారు. ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 121 వినతులు వచ్చాయి. రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.విఎస్ లోకేశ్వరరావు, గ్రామ సచివాలయ శాఖ జిల్లా నోడల్ అధికారి కుమార్ తో కలసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పలు గ్రామాల నుండి మహిళలు తల్లికి వందనం డబ్బులు అకౌంట్‌లో పడలేదని దరఖాస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్, డిఆర్‌డిఎ పిడి వి.మురళీ, డిఎంహెచ్ఒ డి.కృష్ణమూర్తి నాయక్, ఆర్అండ్ బి శాఖ ఇఇ బాల సుందరబాబు, డిపిఒ కెపి చంద్ర శేఖర్, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎ.జయప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ నాగేశ్వరరావు, పిఆర్ ఇఇ కొండయ్యపడాల్, గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-కాశీపట్నం: సదరం స్లాట్ బుకింగ్ ఈ నెల 14వ తేదీ నుండి ప్రారంభం అయ్యిందని బొర్రా కోనాపురం పంచాయతీ కార్యదర్శి మోదేశ్వరావు ప్రకటనలో తెలిపారు. నవంబర్, డిసెంబర్ 2025 రెండు నెలలకుగాను సదరం స్లాట్ బుకింగ్ నిమిత్తం తమ దగ్గరలోని ఉన్న బొర్రా గ్రామ సచివాలయంలో సదరం స్లాట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. కోనాపురం, బొర్రా గ్రామ పంచాయతీ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పంచాయతీ కార్యదర్శి మోదేశ్వరావు తెలిపారు.

కార్మికుల పట్ల నిర్లక్ష్యధోరణి తగదు



సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరో మండల మహాసభ

సిఐటియు జిల్లా అధ్యక్షురాలు వాణిశ్రీ ఘనంగా రంపచోడవరం మండల మహాసభ

ప్రజాశక్తి - రంపచోడవరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల చాలా నిర్లక్ష్యధోరణితో ఉన్నాయని, వారికి కనీస వేతనం ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ ఆరోపించారు. సిఐటియు ఆరో మండల మహాసభ శుక్రవారం కె.రామలక్ష్మి అధ్యక్షతన రంపచోడవరం సిఐటియు కార్యాలయం వద్ద జరిగింది. సిఐటియు సీనియర్ నాయకురాలు కారం రామలక్ష్మి సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఉపాధ్యక్షులు కంభం శాంతిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ కార్మికులకు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే బీమా సౌకర్యం కూడా కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయని, కావున కార్మికులందరూ సంఘటితమై భవిష్యత్తు పోరాటాలకి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి కార్మికులు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్మికుల శ్రమను కార్పొరేట్‌శక్తులు బడా పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నాయని విమర్శించారు. మహాసభలో నూతన సిఐటియు మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా తీగల శ్రీనివాస్, కో కన్వీనర్‌గా కారం, రామలక్ష్మి వీరితో పాటు మరో 19 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొమరం చెల్లాయమ్మ, అంగన్‌వాడి యూనియన్ నాయకులు సింగారమ్మ, కారం లక్ష్మి, బుల్లియమ్మ వెలుగు యానిమేటర్స్ జిల్లా కార్యదర్శి అరగటి రామకృష్ణ , శానిటేషన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



కన్వీనర్ తీగల శ్రీనివాస్, కో కన్వీనర్ కారం రామలక్ష్మి



అవగాహన కల్పిస్తున్న సిహెచ్‌సి వైద్యసిబ్బంది

డయాబెటిస్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి- అడ్డతీగల: డయాబెటిస్ వ్యాధిపై అవగాహన అవసరమని స్థానిక కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లో వైద్యులు తెలిపారు. డయాబెటిస్ డే సందర్భంగా సిహెచ్‌సిలో శుక్రవారం అవగాహన కార్యక్రమం అనంతరం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శ్రీ హర్ష, హాస్పిటల్ కౌన్సిలర్ నారే వాసు మాట్లాడుతూ డయాబరెటిస్ వంశపారపర్యంగా, ఒబేసిటి, అతిగా తినడం, వ్యాయామం లేకపోవడం వంటి కారణాల వల్ల వస్తుందని వివరించారు. డాక్టర్ ప్రసన్న దేవి మాట్లాడుతూ ఆడవాళ్ళలో ఎక్కువగా అతిమూత్రం, అలసట ఉంటే వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ అనూష తదితరులు పాల్గొన్నారు.



శ్యామలదేవిని సన్మానిస్తున్న మన్యపుత్ర యువజన సంఘం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శ్యామలదేవికి సన్మానం


ప్రజాశక్తి- జీకే వీధి : రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని శ్యామలదేవిని రింతాడ మన్యపుత్ర యువజన సంఘం అధ్యక్షుడు సోమేశ్ కుమార్(ఉప సర్పంచ్) రింతాడ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం పురస్కరించుకొని వారి తల్లిదండ్రులు, పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు గణేశ్వరరావును సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం జూనియర్ బాలికల వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థి శ్యామలదేవి, చెస్‌లో రాణించిన ప్రసన్నకుమార్‌కు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకం బహూకరించి అభినందించారు. ఉపసర్పంచ్ సోమేష్‌కుమార్, పాఠశాల హెచ్ఎం అప్పలరాజు, స్కూల్ కమిటీ చైర్మన్ శరభన్న దొర, పీసా కార్యదర్శి రాజేష్ కుమార్, పూర్వ విద్యార్థులు శ్యామలదేవిని అభినందించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్

పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి -సీలేరు: 2025- 26లో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని అల్లూరి జిల్లా స్కూల్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్ సూచించారు. జీకే వీధి మండలం సీలేరులో శుక్రవారం ఆయన విస్తృతంగా శుక్రవారం పర్యటించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా స్కూల్ ఎడ్యుకేషనల్ కమిషనర్ విజయరామరాజు ఎస్ఎస్‌సి బోర్డు డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు రాబోయే రోజుల్లో పదో తరగతి విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు చేశామన్నారు. దీనిలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు ఎపి గురుకుల పాఠశాల, బాలికల ఆశ్రమ పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు సందర్శించి విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులు ఉన్నాయా లేదా అంశాలపై అధ్యయనం చేశామన్నారు. ప్రిన్సిపాల్ బుచ్చిబాబు హెచ్ఎం నాగశకుంతల, ఉపాధ్యాయులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ యాదగిరిశ్వరరావు

స్త్రీనిధిలో శతశాతం రికవరీ చేయాలి

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: స్త్రీనిధిలో వందశాతం రికవరీ చేయాలని ఎంపిడిఒ యాదగిరిశ్వరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద శుక్రవారం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ స్త్రీనిధి ఎన్‌పిఎ ఉన్న విఒ అధ్యక్షురాలను, బకాయిలు ఉన్న వారికి నోటీసులు ఇచ్చి రికవరీ జరిగే విధంగా చూడాలన్నారు. బ్యాంకు లింకేజీ కూడా అర్హత ఉన్న ఎస్‌హెచ్‌జిలను గుర్తించి, బ్యాంకు లింకేజీ లోన్లు ఇప్పించాలన్నారు. సమావేశంలో వెలుగు ఎపిఎం రామాంజనేయులు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు బాలమ్మ, లీడర్లు, సాగినదేవి, కోసూరి లక్ష్మి, సిసిలు పాల్గొన్నారు.

జర్రెల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- జికె వీధి: మండలంలోని జర్రెల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం రాత్రి కలుషిత ఆహారం తిని 50 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. విషయం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా వైసిపి అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు శుక్రవారం విద్యార్థులను పరామర్శించి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని మండి పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గిరిజన పాఠశాలల్లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇంత జరిగినా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బోయిన కుమారి, మండల పార్టీ అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్, మండల ఉపాధ్యక్షులు వంతాల అరుణ్ కుమార్, రీమేల బాలకృష్ణ, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఎటపాక: గ్రామీణబ్యాంకులో సమస్యలు పరిష్కరించా లని ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మావతి డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నెల్లిపాక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌కి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు, ఇతర అప్పుల పేరుతో రైతు భరోసా వంటి తదితర వ్యక్తిగత నగదును జమ చేసుకుంటున్నారని ఆరోపించారు. అలాగే బ్యాంకుకు కొత్త భవనం మంజూరు చేయాలని, బ్యాంకు సిబ్బందిని పెంచాలని, తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మేనేజర్‌కి శుక్రవారం ఐద్వా నాయకులు అందించారు. మహిళలు, రోజు కూలి చేసుకునే వారువారాల తరబడి బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యవసాయసీజన్లో మహిళలు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే అధికారులు స్పందించి తక్షణమే నెల్లిపాక గ్రామీణ బ్యాంక్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా ఎటపాక మండల కార్యదర్శి పొడియం రత్తమ్మ, మండల కమిటీ సభ్యులు సోయం వీరమ్మ, పొడియం సునీత పాల్గొన్నారు.



బిఎంకు వినతిపత్రం ఇస్తున్న ఐద్వా నాయకులు

ముగిసిన సర్టిఫికెట్ కోర్సు శిక్షణ



విద్యార్థులతో అధ్యాపకులు

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఎం ఉషా సౌజన్యంతో నిర్వహించిన సర్టిఫికెట్ కోర్స్ 'డేటా ఎనాలిటిక్స్' శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఐదు రోజుల పాటు కొనసాగిన ఈ శిక్షణలో విద్యార్థులు ఆధునిక డేటా విశ్లేషణ పద్ధతులను నేర్చుకున్నారు. ముగింపు సభలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి మాట్లాడుతూ, విద్యార్థులు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందించడంలో కళాశాల యాజమాన్యం ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తుందని తెలిపారు. అనంతరం డేటా ఎనాలిటిక్స్ ట్రైనర్ కెవి.శ్రీకృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో పీఎం ఉషా కోఆర్డినేటర్ డాక్టర్ వి.రమణ, ఇంగ్లీష్ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ డి.కేజియా, కెమిస్ట్రీ అధ్యాపకులు ఐ.రవీంద్ర నాయక్, కన్వీనర్ వి.ఈశ్వరరావు, కో-కన్వీనర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేయాలి

గిరిజన మహిళా సంఘం మండల అధ్యక్షురాలు కాసులమ్మ

ప్రజాశక్తి-కాశీపట్నం: అసంపూర్తిగా ఉన్న కితలంగి, బోందుగుడ అంగన్ వాడీ భవనాన్ని పూర్తి చేయాలని గిరిజన మహిళ సంఘం మండల అధ్యక్షురాలు కాసులమ్మ స్వాభి డిమాండ్ చేశారు. అనంతగిరి మండలం కోనాపురం గ్రామ పంచాయతీలో 2015వ సంవత్సరం భవన నిర్మాణం పని మొదలు చేసి ఇప్పటివరకు పూర్తి చేయలేదని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గతంలో ఇదే తెదేపా అధికారంలో ఉన్నప్పుడు 12 లక్షలు అంగన్వాడి భవనం ర్మాణం చేయుటకు మంజూరు చేసిందన్నారు. గుత్తేదారు మధ్యలోనే అసంపూర్తిగా వదిలేసారని చెప్పారు. దీంతో అద్దె భవనంలో కొనసాగిస్తున్నారన్నారు.

ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి కృషి



భవనాన్ని పరిశీలిస్తున్న సింహాచలం

ప్రజాశక్తి- హుకుంపేట:హుకుంపేట ప్రెస్ క్లబ్ భవనంను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గుజ్జెలి సింహాచలం శుక్రవారం పరిశీలించారు.భవనం పూర్తిగా శిథిలమైంది.విలేకరుల సమస్యలను విన్న అనంతరం సింహాచలం సానుకూలంగా స్పందిస్తూ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులతో మాట్లాడి, కొత్త ప్రెస్ క్లబ్ భవనం, ప్రహరీ నిర్మాణానికి తన వంతు సహాయం అందిస్తాను అని ప్రకటించారు.జర్నలిజం రంగంలో దీర్ఘకాలంగా కొనసాగుతూ కుటుంబ పోషణలో ఇబ్బందులు పడుతున్న మీడియా ప్రతినిధుల సంక్షేమంపై ప్రభుత్వాలు పునరాలోచన చేయాలని విలేకర్లు కోరారు.

పలుచోట్ల ఘనంగా బాలల దినోత్సవం



హుకుంపేటలో బహుమతులు ఇస్తున్న టీచర్లు



కాశీపట్నంలో విద్యార్థులతో టీచర్లు

ప్రజాశక్తి-హుకుంపేట:విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంలో కూడా రాణించాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ గుజ్జెలి సింహాచలం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వం ఉన్నత పాఠశాల (బాలురు)లో ప్రధానోపాధ్యాయుడు సువర్ణరాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలకు సింహాచలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా విద్యార్థుల కోసం నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ఆయన బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ, విద్య ద్వారానే సమాజంలో అనేక మార్పులు తెచ్చుకోవచ్చు" అని పేర్కొన్నారు తరగతి గదుల మరమ్మతులు, తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలను వివరించగా, సింహాచలం సానుకూలంగా స్పందించారు. త్వరలోనే అధికారులతో సమావేశమై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను" అని హామీ ఇచ్చారుఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాశీపట్నం:అనంతగిరి మండలం కేంద్రంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల-2లో బాలల దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు బి.మంగమ్మ ఆధ్వర్యంలో జవహర్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ మాట్లాడుతూ.. బాలల దినోత్సవ విశిష్టతను,నెహ్రూ జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు.గెలిపొందిన వారికి బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, వార్డెన్ పాల్గొన్నారు.

విఆర్‌పురం: విద్యార్థులు మంచి విలువలు, ఆచరణతో ముందుకు సాగాలని అబ్దుల్‌కలాం స్కూల్ కరస్పాండెంట్ యం.డి.సాదత్ అన్నారు. మండలంలోని అబ్దుల్ కలాం స్కూల్‌లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జవహర్‌లాల్‌నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానానికి ఎదగాలన్నారు. ప్రిన్సిపాల్ మాదిరెడ్డి రామలక్ష్మి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంపచోడవరం : మండల న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్ జ్యూడిషయల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ రంపచోడవరం యం.మురళిగంగాధరరావు ఆధ్వర్యంలో ఎంపిపి పాఠశాలలో న్యాయ అవగాహనాసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు బాల్య వివాహచట్టలు, బాల కార్మిక చట్టాలు, పోక్సో చట్టం వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు యర్ల శ్రీనివాసరావు, చిక్కు సంతోష్‌కుమార్, ధర్మల లక్ష్మీనారాయణ, కోర్ట్ సూపరింటెండెంట్ నాగభూషణం, పాఠశాల అధ్యాపకురాలు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీలేరు: క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని ప్రిన్సిపల్ బుచ్చిబాబు విద్యార్థులకు సూచించారు. జికె వీధి మండలం సీలేరు ఏపి గురుకుల పాఠశాలలో శుక్రవారం నెహ్రూ జయంతి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు అండర్ 14 అండర్ 15 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించామన్నారు. వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కొయ్యూరు: మండలంలోని కొమ్మిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ



కొయ్యూరులో నెహ్రూకు నివాళులర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు

పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం సత్యనారాయణ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ.. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని బోర్నగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రమేష్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధనతో బాగా చదివి ఉన్నతస్థానానికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వరప్రసాద్, కృష్ణ, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో చాచా నెహ్రూకు నివాళులు



విఆర్.పురంలో బహుమతులు అందుకున్న చిన్నారులతో ఉపాధ్యాయులు

కష్టించి చదివితే మంచి భవిష్యత్

ఐపిఎస్ అధికారి మోకా సత్తిబాబు



మాట్లాడుతున్న ఐపిఎస్ అధికారి సత్తిబాబు

ప్రజాశక్తి - సీతమ్మధార: సరైన ప్రణాళికతో కష్టపడి చదివితే మంచి భవిష్యత్ సాకారమౌతుందని ఐపిఎస్ అధికారి మోకా సత్తిబాబు అన్నారు. శుక్రవారం ఎండాడలోని అంబేద్కర్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (యాక్స్) కాలేజీని సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. నిరుపేద కుటుంబానికి చెందిన తాను ఇంటర్‌లో కాలేజీకి 11కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లేవాడినని, సెకెండియర్‌లో వచ్చిన స్కాలర్‌షిప్‌తో సైకిలు కొనుక్కుని పట్టుదలతో చదవడంతో నేడీ స్థాయికి చేరానన్నారు. తల్లిదండ్రులనే నిజమైన హీరోలుగా భావించి, వారికి మంచి పేరు తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. ప్రముఖ నేత్రవైద్యనిపుణులు డాక్టర్ తెన్నేటి జయరాజు మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే నిరంతరం కొత్త విషయాలను తెలుసుకుంటూ, నిత్యవిద్యార్థిగా ఉండాలన్నారు. ఈసందర్భంగా తాను రచించిన 'విజయం కోసం పయనం' పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కళాశాల చైర్మన్ బి.రాజారావు, సెక్రటరీ జెవి.ప్రభాకరరావు, వైస్ ప్రెసిడెంట్ గారా సత్యనారాయణ, కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.పద్మారావు, వైస్ ప్రిన్సిపల్ పి.అప్పలరాజు, ట్రైనింగ్ ఆఫీసర్ డాక్టర్ ఉప్పాడ వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదు వేల కాలేయ మార్పిడి ఆపరేషన్లతో అపోలో అరుదైన ఘనత

ప్రజాశక్తి - ఆరిలోవ : ఐదు వేల కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా భారతదేశంలోనే ప్రత్యేక మైలురాయిని చేరుకున్న మొదటి ఆసుపత్రిగా అపోలో నిలిచిందని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి అన్నారు. పాతికేళ్లుగా నిరంతరం సాగించిన క్లినికల్ ఆవిష్కరణలు, రోగుల సంరక్షణ, 50కి పైగా దేశాల నుంచి తీవ్రమైన కాలేయ వ్యాధితో బాధపడుతూ వచ్చిన రోగులలో ఆశను నింపాలనే లక్ష్యంతో చేసిన కృషికి తొలి అడుగు అన్నారు. అపోలో కాలేయ మార్పిడి కార్యక్రమం ద్వారా రెండు దశాబ్దాలుగా ఎబిఒ అనుకూలత లేని, సంయుక్త కాలేయ, మూత్రపిండాల మార్పిడి వంటి క్లిష్టమైన శస్త్రచికిత్సలను నిర్వహించి అపోలో ముందుంటున్నదని, వయోజనులకే కాకుండా కేవలం 4 నెలల వయస్సు, మూడున్నర కిలోల బరువున్న శిశువులకు కూడా విజయవంతంగా చికిత్స అందిస్తుందన్నారు.

ప్రభుత్వ పెన్షనర్ల నూతన కార్యవర్గం

ప్రజాశక్తి భీమునిపట్నం : ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ పింఛనుదారుల డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వ పింఛనుదారులసంఘం భీమిలి తాలూకా యూనిట్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో యూనిట్ కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా టి భీమారావు మూడోసారి ఎన్నికవ్వగా, కార్యదర్శిగా కె సన్యాసినాయుడు, కోశాధికారిగా పి రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షునిగా ఎం ఆనందరావులను ఎన్నుకున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గ్రాడ్యూటీ, డిఎ, ఇతర బకాయిలు విడుదల చేయాలని, హెల్త్ స్కీమ్ పటిష్టవంతంగా అమలు చేయాలని, రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు

'అనధికార దత్తతలు ప్రోత్సహించొద్దు'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: అనధికార దత్తతలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించొద్దని వక్తలు పేర్కొన్నారు. చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా కెజిహెచ్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'అధికారిక దత్తతలనుప్రోత్సహిద్దాం,అనధికార దత్తతలను నివారించేందుకు అవగాహన కల్పిద్దాం' పేరిట చైల్డ్‌రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రూపొందించిన కరపత్రం ఆవిష్కరించారు. చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం సంధ్యాదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను అనుసరించి మాత్రమే అధికారిక దత్తత పొందడం సులభతరమన్నారు. కెజిహెచ్‌లో ఈ విషయమై ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గొండు సీతారాం మాట్లాడుతూ బాలల హక్కులు, వారి పరిరక్షణలో భాగంగా వివిధ చట్టాలు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై తమ ఫోరం తరపున ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు అడుగులు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కెజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్‌నాయుడు, ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ బి.బంగారయ్య, ఆయుర్జీవ సంస్థ ఫౌండర్ ఎస్.సుబ్బులక్ష్మి, చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం ప్రతినిధులు కె.ఎల్లయ్య, సనపల ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

దుప్పితూరులో భూ ఆక్రమణపై చర్య తీసుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: అనకాపల్లి జిల్లా, అచ్యుతాపురం మండలం, దుప్పితూరు సర్వే నెం. 40-2లో కోట్ల విలువైన భూములను కూండ్రపు సత్య, పైలా వెంకటస్వామి అలియాస్ బాబు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని వారిపై తక్షణం తగు చర్యలు తీసుకోవాలని భూ యజమానలు, బాధితులు విజయనగ రానికి చెందిన భీమరశెట్టి రమణబాబు, భీమరశెట్టి లక్ష్మి నారీమణి కోరారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ, మొత్తం 11 ఎకరాల, 23.5 సెంట్లు భూమిని, తాము కొనుగోలు చేశామని, ఈ భూమి 2004 మే 28న ఎలమంచిలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ ఇద్దరితో పాటు పెంటకోట రామజోగినాయుడు అనే వ్యక్తితో కలిపి మొత్తం ముగ్గురికి రిజిస్టర్ అయిందని నేటి వరకూ తమ సంపూర్ణ హక్కు భుక్తంలో ఉందని తెలిపారు. అయితే కూండ్రపుసత్య, పైలా వెంకటస్వామి అలియాస్ బాబు వగైరాలు దురాక్రమణ చేసేందుకు ప్రయత్నించగా తాము అచ్యుతాపురం పోలీసులకు, తహశీల్దార్‌కు నెలరోజుల కిందట లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. తహసీల్దార్ నోటీసులు జారీ చేశారని, ఈ వ్యవహారంపై తమకు న్యాయం చేయాలని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

జాతీయస్థాయి పోటీల్లో బహుమతులు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: ఇటీవల పూరీలో జరిగిన భారతీయ శిశు శస్త్ర చికిత్స వైద్య నిపుణుల సదస్సులో ఆంధ్ర వైద్య విద్యార్థులు ప్రతిభకు పట్టం కట్టారు. జాతీయస్థాయి క్విజ్ పోటీల్లో డాక్టర్ తేజా శ్రీనివాస్ ప్రథమస్థానంలో నిలవగా, పరిశోధన పత్ర విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో డాక్టర్ సుశ్మిత, డాక్టర్ వంశీ సూర్య నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శుక్రవారం కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణ శిశుశస్త్ర చికిత్స విభాగాధిపతి డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్, ఫ్రొఫెసర్ డాక్టర్ జె.భాస్కర్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ జి.హసంతి, డాక్టర్ డి.కళ్యాణ్,అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీనివాస్,డాక్టర్ పి.చైతన్య అభినందనలు తెలిపారు.

కెజిహెచ్‌లో రేడియోథెరపీ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేజీహెచ్‌లో రేడియోథెరపి డిపార్ట్‌మెంట్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కెజిహెచ్ సిఎస్ఆర్‌బ్లాక్ నందు రేడియోథెరపి విభాగంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.1983 నవంబర్ 14 న రేడియో థెరపీ ప్రత్యేక విభాగంగా ఏర్పడింది. ఈ సందర్భంగా తొలి ఆచార్యులు, విభాగాతివతియైన డాక్టర్ ఎన్.వెంటకపతిరాజు, పూర్వ విభాగాతిపతులు డాక్టర్ ఎన్.శివశంకర్, డాక్టర్ ఎన్.సుజాతలను సన్మానించారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యా దేవి,రేడియోథెరపీ విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రీనివాస్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.పాండురంగకుమారి, ఇతర విభాగాల విభాగాతిపతులు, ఇతర సిబ్బంది హాజరయ్యారు.

అంగన్‌వాడీలకు ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలి



విఆర్‌పురం: సచివాలయ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు




జికెవీధి: పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి- విర్‌పురం: మండలంలోని చిన్నమట్టపల్లి సచివాలయం వద్ద శుక్రవారం అంగన్‌వాడి వర్కర్స్ నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా నాయకురాలు సున్నం రంగమ్మ మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని కాపర్స్ డేటా మొబైల్ ద్వారా పంపడానికి సిగ్నల్స్ లేక అంగన్‌వాడి వర్కర్స్ చాలా ఇబ్బంది పడుతున్నారని. ఎఫ్ ఆర్ ఎస్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్స్ సోడే కనకలక్ష్మి, కుంజా సరోజినీ, సోడే సునీత తదితరులు పాల్గొన్నారు.


కూనవరం: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయాలనే ఆలోచన విరమించుకోవాలని సిఐటియు మండల కన్వీనర్ పాయం సీతారామయ్య తెలిపారు. శుక్రవారం ఈ మేరకు మండలంలోని అన్ని సచివాలయాల్లో సిబ్బందికి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 3 నుంచి 6 సంవత్సరాల్లోపు పిల్లలు అంగన్‌వాడిల్లో ఉండే విధంగా జిఒ జారీచేయాలన్నారు. అంగన్‌వాడీలకు అదనపు పనిభారం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీ ప్రసన్న, ముత్తమ్మకుమారి తదితరులు పాల్గొన్నారు.

జికె వీధి: అంగన్‌వాడీల్లో ఉండే ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని అంగన్‌వాడి వర్కర్ వెల్ఫేర్ యూనియన్ మండల కార్యదర్శి అప్పలనర్స అన్నారు. రింతాడ సచివాలయం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలో విలీనం చేయకూడదని మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడి కేంద్రంలో ఉండే విధంగా చూడాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయా లన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి సెక్టర్ నాయకులు జ్యోతి దుచ్చరపాలెం సెక్టర్ నాయకులు భవాని, కుమారి పాల్గొన్నారు.

సీలేరు: అంగన్వాడి సెంటర్లు ప్రభుత్వ పాఠశాలలో విలీనం చేయకుండా చర్యలు తీసుకోవాలని అంగన్వాడి వర్కర్ వెల్ఫేర్ యూనియన్ జీకే విధి మండల అధ్యక్షులు ఎల్ సత్యవతి, ధారకొండ పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశామన్నారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్లకు అదనపు పనులు అప్పగించరాదని ఆన్‌లైన్ వర్క్‌తో కార్యకర్తలు ఒత్తిడికి గురవుతున్నారని ఆన్‌లైన్ వర్క్ తగ్గించాలని డిమాండ్ చేశారు. ధారకొండ సెక్టర్ నాయకులు యశోద మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.



సీలేరు: కార్యదర్శి రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న సత్యవతి, తదితరులు



కూనవరం : సచివాలయంలో వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పలుచోట్ల గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలో కూనవరం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. లైబ్రేరియన్ మాదేటి గోవిందరాజులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా లైబ్రరీ అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ వెంకటస్వామి, వైస్ ప్రెసిడెంట్ రవి, కార్యదర్శి దాసరి నరేంద్ర పాల్గొని ముందుగా సరస్వతీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల గొప్పతనాన్ని వక్తలు తెలిపారు. అభివద్ధి కమిటీ వైస్ ప్రెసిడెంట్ రవి ఆరు కుర్చీలను వితరణగా అందించారు. అనంతరం లైబ్రేరియన్ గోవిందరాజులను సన్మానించారు. ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయులు, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: 58వ జాతీయ గ్రంథా లయ వారోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో శుక్రవారం ఆశ్రమ పాఠశాల హెచ్ఎం ప్రభుదాస్ జెండా ఆవిష్కరణ చేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ టి.సుబ్బారావు మాట్లాడుతూ, గ్రంథాలయాలు విజ్ఞాన దేవాలయాలు వంటివని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ దన్నీరావు, గ్రంథాలయ అధికారిణి ఎస్.సునీత, సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



విఆర్‌పురం: సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

23న గురు వైభవం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: ఈనెల 23 న సాయంత్రం 5:30 గంటలకు ఎంవిపి కాలనీలోని టిటిడి కళ్యాణ మండపంలో గురువైభవంపై వేదాంత శ్రవణ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు పెంట వాశిష్ఠ కార్తికేయ శర్మ, అవసరాల సంపత్ తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ, వేదశాస్త్ర పండితులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, ప్రముఖ భాషా, శాస్త్ర పండితులు పేరు రవికుమార్ పాల్గొని గురు వైభవంపై వేదాంత శ్రవణ బోధన చేస్తారని తెలిపారు. హాజరవాలనుకునే వారు 9502238017, 9160686669 నెంబర్లతో సంప్రదించవచ్చు అన్నారు.

కమిషనర్‌గా తేజ్‌భరత్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ: విఎంఆర్డిఎ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఇటీవల ప్రభుత్వంచే నియమించబడ్డ ఎన్.తేజ్‌భరత్, శుక్రవారం మెట్రోపాలిటన్ కమిషనర్‌గా విఎంఆర్డిఎ కార్యాలయంలోని తన చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాధిపతులు ఆయనను కలిసి అభినందించారు. తదుపరి విఎంఆర్డిఎ చైర్‌పర్సన్ ఎంవి ప్రణవ్‌గోపాల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి తదుపరి సంస్థ ప్రస్తుతం చేపడుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై ఇరువురు చర్చించుకున్నారు.

కెజిహెచ్‌కు వీల్‌చైర్ల వితరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: నాగలంక మండలం, సొర్లగొంది గ్రామానికి చెందిన కొక్కిలిగెడ్డయూబ్ శుక్రవారం నాలుగు వీల్‌చైర్లు, రెండు బిపి ఆపరేటర్స్‌ను కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి విరాళంగా అందజేశారు. గతంలో కెజిహెచ్‌లో చికిత్స చేయించుకున్నందుకు గాను, ఆయనకు అందిన మెరుగైన వైద్య సేవలకు గుర్తింపుగా రూ.20 వేల విలువ గల వీల్‌చైర్లు, బి.పి. ఆపరేటర్స్‌ను విరాళంగా ఇచ్చారని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సేవానిరతిని కొనియాడారు.

ఘనంగా నరెడ్కో ప్రాపర్టీ ఫెస్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: నరెడ్కో ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు బీచ్ రోడ్‌లోని గాదిరాజు ప్యాలెస్‌లో తలపెట్టిన ప్రాపర్టీ ఫెస్ట్ - 2025ను శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ చంద్రబాబు కృషితో పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చి రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నారన్నారు. పారిశ్రామికంగానే కాక టూరిజం ద్వారా అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయన్నారు. అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని వచ్చిన కంపెనీలు కూడా ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయని తెలిపారు. వాటిని తిరిగి రప్పించడంతో పాటు కొత్త పెట్టుబడులకు నిలయంగా మార్చామని పేర్కొన్నారు. ఇదంతా చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్, కేంద్ర ప్రభుత్వ సహకారంతో సాధ్యమైందని తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, అందుకు అనుగుణంగా ఎన్నో జిఒలు తీసుకు వచ్చామని తెలిపారు. విశాఖలో ఐదు లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయన్నారు. నరెడ్కో ప్రతినిధులు తమను అనేకసార్లు కలసి ఇబ్బందులు చెప్పారని, జిఒలు సరిచేయడంలో వారితో చర్చించిన తర్వాతే నిర్ణయం చేసామని తెలిపారు. నరెడ్కో జాతీయ అధ్యక్షులు హరిబాబు మాట్లాడుతూ నరెడ్కో ఆధ్వర్యంలో ఇటువంటి ప్రోపర్టీ షోలు భవిష్యత్‌లో దేశమంతా నిర్వహించే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల నుండి జాతీయ అధ్యక్షులుగా తాను మొట్టమొదటి సారిగా ఎన్నికయ్యానని తెలిపారు. నరెడ్కో రాష్ట్ర అధ్యక్షులు గద్దే చక్రధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఎన్నో జిఒలు రియల్‌ఎస్టేట్ అభివృద్ధికి తీసుకురాగలిగామన్నారు. గూగుల్, మిట్టల్ స్టీల్, టిసిఎస్, రిన్యూ ఎనర్జీ వంటి సంస్థల రాకతో నగరం పెట్టుబడుల గమ్యస్థానంగా మారిందన్నారు. ప్రాపర్టీషో ద్వారా కొనుగోలు చేసి ప్రత్యేక రాయితీలతో పాటు లబ్ధిపొందాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, గౌతు శిరీష, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, విఎంఆర్‌డిఎ కమిషనర్ తేజ్ భరత్, నరెడ్కో ఉత్తరాంధ్ర అధ్యక్షులు రమేష్ బాబు, విశాఖ అధ్యక్షులు రాజశేఖర్, ప్రతినిధులు సుబ్బారావు, వెంకన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.